నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 13 మార్చి 2024 | NALGONDA

## లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి : కలెక్టర్ హరిచందన


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ హరిచందన

నీలగిరి, మార్చి12 : లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వాన్ని తీసుకొచ్చేందుకు ప్రతి మహిళ ముందుకు రావాలన్నారు. పిల్లలను పెంచడంలో వ్యత్యాసం చూపించవద్దని, ఆడైనా, మగైనా ఒకటేనని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు విద్య అందించాలని, ప్రత్యేకించి బాలికలు తప్పనిసరిగా చదువుకునేలా చేయాలని, అప్పుడే వివక్ష లేని సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ స్థాయీ సంఘం చైర్మన్ కంకణాల ప్రవీణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి, పగిళ్ల వేణు, సీడీపీఓ తూముల నిర్మల, ఐసీడీఎస్ అధికారులు, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.


పెద్దగట్టు వద్ద కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ తదితరులు

## బీఆర్ఎస్ హయాంలోనే పెద్దగట్టు అభివృద్ధి

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- పెద్దగట్టు వద్ద రూ 65 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం

చివ్వెంల, మార్చి 12 : రాష్ట్రంలోనే అతి పెద్ద రెండో జాతరైన పెద్దగట్టు లింగమంతుల ఆలయం బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దురాజ్‌పల్లిలోని పెద్ద గట్టు ఆలయ ప్రారంగణంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ తన ఎంపీ నిధులు రూ 65 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఎంపీ బడుగుల లింగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కనీసం నిలువ నీడలేని పెద్ద గుట్ట ప్రాంతాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లంమల్లయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, రాంమూర్తి యాదవ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాస శ్రీనివాస్ యాదవ్, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, ఎంపీపీలు బీరవోలు రవీందర్‌రెడ్డి, నెమ్మాది భిక్షం, దావుల మనీషా వీరప్రసాద్ యాదవ్, జడ్పీటీసీ జీడి భిక్షం, కాంగ్రెస్ నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, రామగిరి నగేశ్, ధరావత్ బాబునాయక్ పాల్గొన్నారు.

# ధాన్యం ధర ఢమాల్

| మిల్లర్లు సిండికేట్ | తక్కువ ధరకు సన్నధాన్యం కొనుగోలు

- వారం క్రితం క్వింటా రూ.2,600 నుంచి 2,700
- ఇప్పుడు పచ్చ గింజ పేరుతో అడ్డగోలుగా కోతలు
- 2,200-2,300 మధ్య ధరే అత్యధికం
- పట్టించుకోని అధికారులు


మిర్యాలగూడ పట్టణంలోని ఓ రైస్ మిల్లుకు ధాన్యం విక్రయించేందుకు ట్రాక్టర్లతో వచ్చిన రైతులు

మిర్యాలగూడ, మార్చి 12 : కాలం కలిసి రాకున్నా, పంటకు సాగు నీరు అందకున్నా.. అష్టకష్టాలు పడి పంట సాగిన రైతాంగాన్ని ఇప్పుడు మిల్లర్లు దోచుకుంటున్నారు. యాసంగి ధాన్యానికి పచ్చ గింజ పేరుతో అతి తక్కువ ధర ఇస్తున్నారు. ఒకవైపు సన్న బియ్యం కింటా రూ.6,500కి పైగా విక్రయిస్తూ.. మరోవైపు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో, నాన్ ఆయకట్టు పరిధిలోనూ బోర్లు, బావుల ఆధారంగా రైతులు యాసంగి వరి సాగు చేశారు. భూగర్భ జలం అడుగంటడంతో ఒక్క మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోనే 10వేల ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. కొద్దోగొప్పో నీటి వసతి ఉన్న రైతులు మడిమడికి పైపులు వేసి ఆరుతడి విధానంలో వరి పండిస్తే తీరా విక్రయించే సమయంలో రైస్ మిల్లర్లు కింటాకు రూ.2,200 నుంచి 2,300లోపే కొనుగోలు చేస్తామని ఖరాకండిగా చెప్తున్నారు.

### వారం క్రితం రూ.2,600కిపైనే..

వారం క్రితం సన్న ధాన్యం రకాలైన చింట్లు, మహేంద్ర చింట్లు, హెచ్‌ఎంటీ ధాన్యాన్ని రూ.2,600 నుంచి రూ.2,700 వరకు మిల్లర్లు కొనుగోలు చేశారు. రెండు మూడు రోజుల నుంచి వరి కోతలు కొంత ముమ్మరం కావడంతో రైస్ మిల్లుల వద్దకు ధాన్యం ట్రాక్టర్లు వస్తున్నాయి. ఇదే అదనుగా భావించి మిల్లర్లు సిండికేట్ అయ్యి రూ.2,300కి ధర పెట్టడం లేదు. ఆ ధరకు ఇస్తే ఇస్తే ఇవ్వండి.. లేదంటో వెళ్లిపోండని చెప్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు.

### పచ్చ గింజ పేరుతో...

వరి కోత యంత్రాల పంట కోయడం వల్ల ధాన్యంలో స్వల్పంగా పచ్చగింజ ఉంటుంది. దాన్ని సాకుగా చూపి వ్యాపారులు ధరను అమాంతం పడేస్తున్నారు. పచ్చ గింజ, తేమ, గట్టి తాలు పేరుతో సాకుల మీద సాకులు చూపి రైతులు వేధిస్తున్నారు. మిల్లర్లంతా ఒకే మాట మీద ఉండడంతో రైతులు ఏ మిల్లుకు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. ధాన్యం విక్రయాలు ప్రారంభమై 20 రోజులు అవుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పర్యవేక్షించే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఎకరాకు రూ.25వేలకు గా పెట్టుబడులు పెట్టి నీరు పారక కొత్త బోర్లు వేసుకోని అధిక పెట్టుబడి పెట్టి పంట పండిస్తే మిల్లర్లు దారుణంగా దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పది మిల్లులు తిరిగినా ఒక్కటే ధర



మండలం నేను బోర్ల ఆధారంగా ఐదెకరాల్లో వరి పండించిన. మూడు ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిర్యాలగూడ మిల్లుకు తీసుకొచ్చా. నాలుగు రోజుల క్రితం రూ.2,600 నుంచి రూ.2,700 వరకు ధర పెట్టారు. నా వడ్లు క్వాలిటీ కూడా మంచిగ ఉన్నాయి. అయినా పది మిల్లులు తిరిగినా తక్కువ ధరకే అడిగారు. ఆఖరికి గతిలేక రూ.2,300కు క్వింటా లెక్కన అమ్ముకున్నాను. వ్యాపారులు సిండికేట్‌గా మారాయి. ఏ మిల్లు దగ్గరకు వెళ్లినా ఒకే ధరకు అడుగుతున్నారు. ఇదేంటని అడిగితే పచ్చగింజ ఉందని సాకులు చెప్తున్నారు. అమ్మితే అమ్ము లేకపోతే వెళ్లపో అని బెదిరిస్తున్నారు. అధికారులు కూడా స్పందించడం లేదు. రైతుల బాధలు పట్టించుకునే వారు కరువయ్యారు.

–శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మారెడ్డిగూడెం రైతు, వేములపల్లి

## కార్గో సేవలతో యువతకు ఉపాధి : ఎంపీ బడుగుల


కొత్తగూడెం గోదాము ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్

మాడ్గులపల్లి, మార్చి 12 : కార్గో సేవలు అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్ అన్నారు. భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా మండలంలోని కొత్తగూడెం వద్ద ఎఫ్‌సీఐ గోదాములో కార్గో సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో ఎంపీ లింగయ్యాయాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. గోదాములు ఉన్న ప్రతి చోట కార్గో సేవలను అందుబాటులోకి తేవాలన్నారు. రైల్వేశాఖ ఎఫ్‌సీఐలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో గోదాము డైరెక్టర్లు వల్లపురెడ్డి కోటిరెడ్డి, సిరిగిరెడ్డి రాంరెడ్డి, జిల్లా శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి ప్రహ్లాద్, ఎఫ్‌సీఐ డీఎం సుశీల్‌కుమార్, రైల్వే ఏడీఈఎన్ సుధాకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జి సతీశ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి అలంకార సేవలు


మత్స్యావతారంలో స్వామివారు (ఫైల్)

యాదగిరిగుట్ట, మార్చి 12 : యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 19 వరకు స్వామివారి అలంకార సేవోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ మహావిష్ణువు అలంకార ప్రియుడు. స్వామివారి మరో రూపమైన నారసింహుడి బ్రహ్మోత్సవాల్లో విశేష పర్వ దినాల్లో వివిధ రకాల అలంకార సేవలను నిర్వహిస్తారు. స్వామివారు వేదరక్షణ కోసమై మత్స్యావతారాన్ని ఆది కల్పనలో అవతరించాడు. లక్ష్మీనారసింహుడు పట్టుపీతాంబరాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో అలంకృతుడై దశావతారాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ వాహన సేవలపై భక్తులకు దర్శనమిస్తారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్ర పఠనాల నడుమ తిరుమాఢవీధుల్లో ఊరేగుతారు. అలంకార సేవలను వెలుపలి ప్రాకార కల్యాణ మండపంలో ముస్తాబు చేసి పశ్చిమ సప్తతల రాజగోపురం గుండా మాఢవీధుల్లో ఊరేగిస్తారు. ఉత్తర, తూర్పు, దక్షిణ మాఢవీధుల్లో ఊరేగించి పశ్చిమ భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేంచేపు మండపంలో ఆస్థానం చేసి అలంకార విశిష్టతకు ప్రధానార్చకులు వినిపిస్తారు. భక్తుల సందర్శనార్థం ఉంచి అర్చకులు వేదమంత్రాలను పఠిస్తారు.

### తొలిరోజు మత్స్యవతార అలంకార సేవ..

బ్రహ్మోత్సవాల్లో విహార పర్వాలు స్వామివారికి ఎంతో ప్రీతికరం. అందుకే స్వామివారి మొదటి అవతారమైన మత్స్యవతారం అలంకారసేవను 13న బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవితో భగవంతుడు ఆదిశేషుడిపై విహరిస్తూ తీర్థ జనానికి ఆహ్లాదాన్ని అందించే అలంకారోత్సవాలు శేషవాహనంపై రాత్రి 7 గంటలకు ఊరేగిస్తారు.

### 14న వటపత్రశాయి అలంకార సేవ..

సృష్టి ప్రారంభ దశలో మర్రి ఆకుపై పవళించిన విష్ణుమూర్తి అవతారాన్ని వటపత్రశాయుడిగా కొలుస్తారు. జగత్ రక్షకుడిగా గురువారం ఉదయం 9 గంటలకు లక్ష్మీనరసింహుడు దర్శనమిస్తారు. ఈ దర్శనం కలి ప్రభావం సోకకుండా మోక్షం ప్రాప్తిస్తుంది. నీటిని, పాలను వేరుచేసే హంస వాహనంపై రాత్రి 7 గంటలకు శ్రీస్వామివారు విహరిస్తూ జ్ఞాన బోధన చేస్తారు.

### 15న శ్రీకృష్ణలంకార (మురళీకృష్ణుడు) సేవ..

భగవంతుడి అవతారాల్లో శ్రీకృష్ణుడి(మురళీకృష్ణుడు) అవతారం ద్వాపర యుగ పురుశుడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణాలంకార సేవను శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. కోరికలు తీర్చే పొన్న వాహన సేవపై యాదగిరీశుడు అలంకృతుడై రాత్రి 7 గంటలకు విహరిస్తారు.

### 16న గోవర్ధనగిరిధారిగా..

దేవతా గర్వాన్ని అణిచేందుకు గోవర్ధనగిరిధారిగా అవతరించిన పర్వాన్ని నిర్వహిస్తారు. ఇంద్రుడి గర్వాన్ని అణిచి లోకానికి నేను అండగా ఉంటానని చాటిచెప్పే అలంకార సేవోత్సవాన్ని శనివారం ఉదయం 9 గంటలకు చేపడతారు. సింహ వాహన సేవోత్సవాన్ని రాత్రి 7 గంటలకు నిర్వహిస్తారు.

### 17న జగన్మోహిని అలంకార సేవ

ప్రకృతి పరంగా అందే ఫలాలు కృషి చేసిన వారికే దక్కాలన్నది జగన్మోహిని అవతార ఉద్దేశం. ఈ సేవలో ఆదివారం ఉదయం 7 గంటలకు స్వామివారు దర్శనమిస్తారు. అసురుల నుంచి సురులకు అమృతాన్ని అందజేసిన విశిష్టతే జగన్మోహిని అలంకార సేవోత్సవం. చంచలగుణం కలిగినది అశ్వం. ఆ అశ్వాన్ని అదుపులో ఉంచేందుకు స్వామి అశ్వవాహనదారుడైన రాత్రి 8.45 గంటలకు విహరిస్తారు. తిరుకల్యాణంలో ప్రధాన ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవాన్ని అశ్వ వాహన సేవపైనే నిర్వహిస్తారు.

### 18న శ్రీరామలంకార సేవ..

జ్ఞానం ఒకరి సొత్తు కాదని చెప్పే శ్రీరామలంకార (హనుమంత వాహన సేవ) సేవలకు స్వామివారు సోమవారం ఉదయం 9 గంటలకు వేంచేస్తాడు. రాత్రి 8.45 గంటలకు గజేంద్ర మోక్షానికి తార్కాణంగా గజవాహనంపై లక్ష్మీనరసింహుడు కల్యాణోత్సవానికి వస్తాడు.

### 19న శ్రీమహావిష్ణువు అలంకార సేవ

గరుడ ఆళ్వారుడిని వేద స్వరూపుడంటారు. కర్మ, జ్ఞానం బోధించే లక్ష్యంతో నారసింహుడు మహావిష్ణువు అలంకరణలో గరుఢవాహనంపై మంగళవారం ఉదయం 9 గంటలకు దర్శనమిస్తారు. రాత్రి 7 గంటలకు దివ్యవిమాన రథోత్సవంపై ఊరేగుతూ కనువిందు గొల్పుతాడు. మోక్ష ప్రాప్తికి ఈ సేవోత్సవం నిదర్శనమని వేద పండితులు చెబుతుంటారు.

## ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి : కలెక్టర్ వెంకట్రావ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, మార్చి 12 : ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లా అండ్ ఆర్డర్‌లతో పాటు పలువురికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే విధుల్లో పాల్గొనే టీంలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మోడల్ కోడ్‌ను జిల్లాలో పక్కాగా అమలు చేయాలన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి పేరు వచ్చిందని, అదే పేరు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పోర్టల్‌లో రాజకీయ, ప్రభుత్వానికి సంబంధించిన ఫొటోలు ఉండకుండా తీసివేయాలని చెప్పారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ జిల్లాలో లా అండ్ ఆర్డర్‌ను పోలీసులు సక్రమంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. గత ఎన్నికల్లో పోలింగ్ ఆలస్యమైన వాటిని గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ధ్వజారోహణం..
# దేవతాహ్వానం

- యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవ పర్వం
- ముక్కోటి దేవతలకు ఆహ్వానం


యాదగిరిగుట్ట ప్రధానాలయంలో ధ్వజారోహనాన్ని తిలకిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 12 : స్వయంభూ పంచ నారసింహుడిగా కొలువుదీరిన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రారండంటూ ముక్కోటి దేవతలకు ఆహ్వానం అందింది. ఉత్సవాల్లో రెండోరోజైన మంగళవారం ఉదయం స్వామివారికి నిత్య కైంకర్యాల అనంతరం బ్రహ్మోత్సవాల్లో ఆదిపూజ అయిన ధ్వజారోహణం అత్యంత వైభవంగా చేపట్టారు. అఖిలాండకోటి బ్రహ్మండనాయకుడైన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవానికి దేవతలందరిని ఆహ్వానించడానికి గరుత్మంతుడిని వియుక్తం చేసే ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణానికి అర్చకులు, వేద పండితులు, రుత్వికులు, పారాయణందార్లు, యాజ్ఞిక బృంద సభ్యులు శ్రీకారం చుట్టారు. ముందుగా ప్రధానాలయం వెలుపలి ప్రాకారంలోని అద్దాల మండపంలో యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, ధ్వజ కుంభారాధన, మహా కుంభారాధన, చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమాలు గావించారు. ప్రత్యేకంగా గరుఢ అధివాసం, గరుఢ హోమం, పాంచరాత్రగమ శాస్త్రరీతిలో పూర్ణాహుతి చేపట్టారు. ప్రధానాలయం ముఖ మండపంలో ధ్వజ స్తంభంపై ధ్వజారోహణం అనంతరం అష్టదిగ్పాలక బలిహరణ కార్యక్రమం చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి మహావిష్ణువుకు ఇష్టమైన వాహనం గరుత్మంతుడిని కొలిచారు. గరుడాళ్వార్ల చిత్రపటం వద్ద పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, ముత్యాల ఆభరణాలతో అలంకరించిన స్వామి, అమ్మవార్లను వేదికపై అధిష్ఠింపజేసి వేదమంత్రాలతో దేవతలను అర్చించారు. గరుత్మంతుడి పటాన్ని శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గరుఢ పతాకాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోపణ చేశారు. ధ్వజ దండాన్ని పూజించి తెల్లని వస్త్రంపై గరుత్మంతుడిని చిత్రించి 27 విధాలైన ఉపచారములతో ఆరాధన చేసి, చతుర్వేదములతో దేవతలను ఆవాహన చేశారు. గరుత్మంతుడు ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన గరుఢ ముద్దలను పైకి ఎగురవేసి పూజలు చేశారు. వివిధ ప్రక్రియల్లో విశేషమైన పూజలతో గరుఢ ధ్యానం గావించి ముద్దల ప్రసాద నివేదన చేశారు. ఈ గరుఢ ముద్దుల స్వీకరిస్తే సౌభాగ్యం, సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తులు పోటీపడి అందుకున్నారు. అనంతరం స్వామివారికి నివేదిన, తీర్థప్రసాదాల గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు.

### దేవతాహ్వానం, హవనం..

స్వామివారి వారి ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం జరిపిన దేవతాహ్వానంలో సాయంత్రం ప్రత్యేక హోమం నిర్వహించారు. చతుస్థానార్చన ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారి సభాస్థానంలో స్వామివారిని పెండ్లి కొడుకు చేసి 33 కోట్ల దేవతలు, 33 కోట్ల పిత్రుదేవతలను 33 రాగాలు, 33 తాళాలు, 33 వేదమంత్రాలతో భూలోకానికి ఆహ్వానించారు. ఇలా ఒక్కో దేవతను మూడు విధాలుగా సంతోష పెట్టి ఆహ్వానం పలికారు. దేవతలందరికీ స్వామివారి దివ్యవిమాన గోపురంలో వసతి సౌకర్యాలు, నైవేద్య కైంకర్యాలను స్వామివారి ద్వారా అర్చకులు అర్పించారు. 33 కోట్ల దేవతలు స్వామివారి బ్రహ్మోత్సవం పూర్తయ్యే వరకు స్వామివారికి నమస్కరిస్తూ ఉంటారని అర్చకులు తెలిపారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా సాగేలా అనుగ్రహించాలని భగవానుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడ నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి రఘు, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సాయంత్రం కార్యక్రమాలు..

ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వా నం, హవనం కార్యక్రమాలను ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృంద సభ్యులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అష్టిదిక్పాలకులను ఆహ్వానించేందుకు రాత్రి భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహించారు. భేరీతాడవం మంత్రపూర్వకంగా జరిపారు. శబ్ధబ్రహ్మం, మూలమంత్ర జపంతో ప్రధాన వాయిద్యమైన భేరీని మోగించి కంకణ ధారణ చేశారు.


యాదగిరిగుట్ట ప్రధానాలయ ముఖ మండపంలో భేరీపూజ నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు వేంకటాచార్యులు

## జోరుగా ఎడ్ల పందేలు


మేళ్లచెర్వులో బండలాడుతున్న ఎడ్లు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 12 : మేళ్లచెర్వులో జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల పందేలు జోరుగా సాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి జనం భారీ గా తరలివచ్చారు. మహిళల విభాగంలో కృష్ణా జట్టు ప్రథమ, సూర్యాపేట జట్టు ద్వితీయ బహుమతులు గెలుపొందగా..రంగారెడ్డి జట్టు మూడో, వైజాగ్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఎద్దుల పందెంలో మంగళవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ బుల్స్ ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. వీటితో పాటు మిగిలిన బహుమతులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆమె పోటీలను వీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు, జడ్పీటీసీ శాగంరెడ్డి పద్మాగోవిందరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఎరా రియాలిటీ చైర్మన్ పోశం నర్సిరెడ్డి, పాల్గొన్నారు.

### స్వామివారికి మహా పూర్ణాహుతి

మహా శివరాత్రి సందర్భంగా మేళ్ళచెర్వు మండల కేంద్రంలోని ఇష్ట కామేశ్వరీ సహిత శంభులింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజు మంగళవారం మహాపూర్ణాహుతి కార్యక్రమం జరిపించారు. వేకువజామున అభిషేకాలు, అర్చనలు, హోమాలు, విశేష పూజలు, త్రిశూల స్థానం తదితర ఘట్టాలను అర్చకులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక టీటీడీ కల్యాణమండపంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


శివాలయంలో పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## కలెక్టరేట్ ఎదుట అంగన్ వాడీల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, మార్చి 12 : అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశ్ మాట్లాడుతూ ఏండ్ల తరబడిగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ పాఠశాల ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ఒక్క పూట కూడా సెలవు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ కుటుంబ సర్వేలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, సిలువేరు రమ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రమ, ఉమ, శోభ, సునీత, సరిత, సత్యలక్ష్మి, వసంత, ప్రమీల, షాహెదా, శోభ, కల్యాణి, రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.


యాదాద్రి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు